క్లుప్తంగా

టీఎస్‌ఎస్టీయూ సభ్యత్వ నమోదు



మల్దకల్: మండలంలోని పెద్దపల్లి, అమరవాయి, బిజ్వారం, కుర్తిరావులచెర్వు, తాటికుంట, మల్దకల్ గ్రామాల్లోని పాఠశాలల్లో సోమవారం టీఎస్‌ఎస్టీయూ ఉపాధ్యాయ సభ్యత్వ నమోదును ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు యూనుస్‌పాష, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో మొట్టమొదటి సంఘం టీఎస్‌ఎస్టీయూ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కృష్ణయ్య, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై పాఠశాల విద్యార్థులు



అయిజ: ఫిట్‌నెస్ లేని పాఠశాలల బస్సులతో విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని కాకతీయ మెమోరియల్ పాఠశాల బస్సు సోమవారం తూంకుంట, నాగర్‌దొడ్డి గ్రామాల మధ్య నిలిచిపోయింది. బస్సు మొరాయించడంతో పాఠశాల విద్యార్థులు కొన్ని గంటలపాటు రోడ్డుపై కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఫిట్‌నెస్ లేని బస్సుల యజమానులపై అధికారులు చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

భాగవత సప్తాహ మహోత్సవం



ఇటిక్యాల: మండలంలోని నక్కలపల్లిలో గ్రామ కమిటీ సభ్యుల సహకారంతో విశ్వహిందూ పరిషత్, వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భాగవత సప్తాహ మహోత్సవం సోమవారం రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు నరసింహులు మాట్లాడుతూ.. ప్రతి మనిషికి ఆనందం ముఖ్యమని, లౌకిక ఆనందం తాత్కాలికం అని నిజమైన ఆనందం భాగవత ప్రవచనం వినడం ద్వారానే అనుభవంలోకి వస్తుందన్నారు.

పాఠశాల సమస్యలు పరిష్కరించాలి



గట్టు: మండల కేంద్రంలోని బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం బీఎస్పీ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి బండారి రాజు జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఇంగ్లిష్ మీడియం ప్రాథమిక పాఠశాలలో 60 నుంచి 70 మంది విద్యార్థులు చదువుకుంటుండగా.. కేవలం ఒకటే తరగతి గది ఉందని, ఇందులో 5 తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అదనపు తరగతి గదులను నిర్మించాలని వారు అదనపు కలెక్టర్‌కు విన్నవించారు.

పింఛన్లు బ్యాంకు ఖాతాలో జమ చేయాలి

కేటీదొడ్డి: ప్రతి నెలా పోస్టాఫీస్‌లో పింఛన్ తీసుకునే లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారని, నేరుగా వారి బ్యాంకు ఖాతాలో జమ చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బీజేపీ మండల మండల అధ్యక్షుడు శ్రీపాదరెడ్డి ఆధ్వర్యంలోని ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని పూజారి తండా, తూర్పుతండా, గువ్వలదిన్నె, కేటీదొడ్డి, కొండాపురం, ఇర్కిచేడు గ్రామాల్లోని వితంతు, వృద్ధాప్య, ఆసరా పింఛన్‌దారులు ఇర్కిచేడు పోస్టాఫీస్‌కు, కేటీదొడ్డి లబ్ధిదారులు నందిన్నెకు వెళ్లి పింఛన్ డబ్బులు తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు హన్మిరెడ్డి, హంపిరెడ్డి, దేవేందర్‌రెడ్డి, ముంగిలి వీరేష్, నాగిరెడ్డి ఉన్నారు.

విద్యుత్ అంతరాయం

అయిజ: నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చేపట్టిన మరమ్మతు పనుల్లో భాగంగా మంగళవారం మండలంలోని వివిధ గ్రామాల్లో 3 గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏడీఈ నీలి గోవిందు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఫాగింగ్‌పై నిర్లక్ష్యం

- వేధిస్తున్న దోమల బెడద
- అనారోగ్యం, విషజ్వరాల బారిన ప్రజలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



మానవపాడులో డ్రైయినేజీలో పేరుకుపోయిన మురుగు

మానవపాడు: వర్షాకాలంలో పారిశుద్ధ్యంపై ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా దోమల ఉధృతి పెరిగి ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. కొన్ని రోజులుగా కురుస్తున్న నిరంతర వర్షాల కారణంగా పరిసరాలు బురదమయంగా మారి అపరిశుభ్రంగా తయారవుతాయి. దీంతో అవి దోమలు, ఈగలకు ఆవాసులుగా, వ్యాధులను వ్యాప్తి చేస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని గ్రామాల్లో నీటి కుంటలు, ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉండడంతో దోమలు ఉధృతి పెరిగింది. వాటి నియంత్రణకు గ్రామాల్లో సక్రమంగా ఫాగింగ్ చేపట్టకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో సీజనల్ వ్యాధులతో ప్రజలు బాధపడుతున్నారు. మండలంలోని 18 గ్రామాల పంచాయతీలు ఉండగా.. కొన్నింటికి ఇప్పటికీ ఫాగింగ్ యంత్రాలు లేవు. యంత్రాలు అందుబాటులో ఉన్న గ్రామాల్లో సరిగ్గా ఫాగింగ్ చేయట్లేదనే ఆరోపణలు ఉన్నాయి.



మానవపాడులో అస్తవ్యస్తంగా డ్రైయినేజీ

కానరాని ప్రత్యేక అధికారులు

సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసిన వెంటనే గ్రామాల్లో ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభించింది. కానీ వారు గ్రామాలకు రావడమే మానేశారని, సమస్యలపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు వాపోతున్నారు. కనీసం అధికారులు ఖాళీ స్థలాల్లో పెరిగిన గడ్డిని సైతం తొలగించడం లేదు. దీంతో పగలు, రాత్రి తేడా లేకుండా దోమలు, ఈగలు ప్రజలపై ప్రతాపాన్ని చూపుతున్నాయి. దీంతో ప్రజలు తరుచూ వ్యాధుల బారిన పడుతున్నారు.

దోమల నివారణకు చర్యలు శూన్యం

వానాకాలం ప్రారంభమై రెండు నెలలు పూర్తవుతున్నా.. దోమల నివారణకు అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమవుతున్నారు. డ్రెయినేజీలు, నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో మురుగుతో దుర్వాసన వెదజల్లుతోంది. దోమల బెడదతో ప్రజలు టైఫాయిడ్, మలేరియాతో పాటు తీవ్రమైన జ్వరం బారిన పడుతూ ఆస్పత్రుల వెంట తిరుగుతున్నారు. బ్లీచింగ్ చల్లడం, రసాయనాల పిచికారీ, నీళ్ల ట్యాంకుల శుభ్రం చేయడం, వీధుల్లో ఫాగింగ్ చేయడం వంటి చర్యలు చేపట్టకపోవడంతోనే ఈ పరిస్థితులు దాపరించాయని ప్రజలు మండిపడుతున్నారు.

చర్యలు చేపడతాం

గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నాం. దోమల నివారణకు చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో మురుగుకాల్వలో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లిస్తాం. సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.

– రాఘవ, ఎంపీడీఓ, మానవపాడు

దోమల బెడద నివారించాలి



గ్రామాల్లో దోమలు బెడద ఎక్కువగా ఉంది. మురుగు కాల్వల్లో చెత్త, మురుగు పేరుకుపోవడం వల్ల దుర్వాసన రావడంతో పాటు దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. గ్రామ పంచాయతీల తరుపున ఫాగింగ్ చేపట్టడం లేదు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– దొడ్ల నాగన్న, మానవపాడు

ప్రత్యేక అధికారులు ఎక్కడ?



గ్రామాల్లో ప్రత్యేక అధికారులు తూతూమంత్రంగా గ్రామసభలు నిర్వహిస్తున్నారు. కానీ గ్రామాల్లో పర్యటించి పారిశుద్ధ్యంపై పట్టించుకోవడం లేదు. దోమల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఉన్నతాధికారులు చొరువ చూపి గ్రామాల్లో ఫాగింగ్ ఏర్పాటు చేసి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి.

– సంజీవనాయుడు, గోకులపాడు

పురుగు పట్టిన బియ్యం గోదాంకు తరలింపు

సాక్షి ఎఫెక్ట్..

మల్దకల్: మండలంలోని అమరవాయి జెడ్పీహెచ్‌ఎస్‌కు పురుగుల బియ్యం పంపిణీ చేయడంపై సోమవారం సాక్షి దినపత్రికలో 'ప్రభుత్వ పాఠశాలలకు పురుగుల బియ్యం సరఫరా' అనే శీర్షికన వార్త కథనం ప్రచురితమైంది. దీంతో కలెక్టర్ బీఎం సంతోష్ ఆదేశాల మేరకు సోమవారం తహసీల్దార్ ఝాన్సీరాణి, ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్ పాఠశాలకు సరఫరా చేసిన బియ్యాన్ని పరిశీలించారు. నాణ్యత లేని బియ్యాన్ని వెంటనే తిరిగి గోదాంకు పంపించాలని వంట ఏజెన్సీ మహిళలు, ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే సివిల్ సప్లయ్ అధికారులు పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న ముక్కిన బియ్యాన్ని వెనక్కి పంపి, నాణ్యమైన బియ్యం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కరీం, ఆర్‌ఐ మహేందర్, ప్రధానోపాధ్యాయుడు నరేష్ తదితరులు ఉన్నారు.



జెడ్పీహెచ్‌ఎస్‌లో పురుగుల బియ్యాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్, ఎంఈఓ

'బాల్య వివాహాలను నిర్మూలిద్దాం'



వీఓఏలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మానవపాడు: మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం బాల్యవివాహల నిర్మూలనపై మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ప్రభావతమ్మ, తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మ, ఎంపీడీఓ రాఘవ ఆధ్వర్యంలో వీఓఏలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాల్య వివాహల నిషేధ చట్టం–2016 ప్రకారం మైనర్లకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. వివాహ నమోదు పత్రాలు ఖచ్చితంగా కలిగి ఉండాలన్నారు. అమ్మాయికి 18ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు పూర్తయిన తర్వాతే వివాహం జరిపించాలన్నారు. గ్రామాల్లో ప్రజలు పూర్తిస్థాయిలో చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం సునంద, సీసీలు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణ

మానవపాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారం, బాలల సంరక్షణ, విద్యా సేవల నాణ్యత పెంపొందిచడానికి పోషన్‌బీ–పడాయి బీ ఎంతగానో దోహదపడుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ సుజాత అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని రైతు వేదికలో అంగన్‌వాడీ టీచర్లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు సిబ్బంది పాల్గొన్నారు.

గట్టు: మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ్ బీ, పడాయి బీ శిక్షణ కార్యక్రమాన్ని మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీడీపీఓ అక్షదీప్తి మాట్లాడుతూ అంగన్‌వాడీకు వచ్చే చిన్నారులకు సమగ్రమైన, నాణ్యమైన ప్రారంభ ప్రేరణ, పూర్వ ప్రాథమిక విద్యను అందిస్తున్నామని తెలిపారు. తగిన బోధనా పద్ధతులను ఉపయోగించడం ద్వారా ప్రాథమిక విద్యతో పాటు చిన్ననాటి నుంచే ఆరోగ్యం, పోషకాహార సేవలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చెన్నయ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సంధ్యారాణి, పుష్పవతి, శశికళ, క్రిష్ణ, సరోజ, వివిధ గ్రామాల అంగన్‌వాడీలు ఉన్నారు.



గట్టులో శిక్షణను ప్రారంభిస్తున్న అధికారులు

టై, బెల్టుల పంపిణీ

రాజోళి: మాన్‌దొడ్డి ఎంపీపీఎస్ పాఠశాలలోని 114 మంది విద్యార్థులకు రైతు సంఘం నాయకులు టై, బెల్టులను సోమవారం పంపిణీ చేశారు. ఉపాధ్యాయులకు ఐడెంటిటీ కార్డులను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రామంలో పాఠశాల విద్యార్థుల హాజరు శాతం పెరిగేలా కృషి చేసిన ఉపాధ్యాయుల సేవలను అభినందించారు. కార్యక్రమంలో ఎంఈఓ భగీరథ రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మన్సూర్, చెన్నయ్య, బొమ్మిరెడ్డి రాజు, మధుసూదన్ రెడ్డి, రాములు, మహేష్ పాల్గొన్నారు.



విద్యార్థులకు బెల్టులు అందచేస్తున్న రైతు సంఘం నాయకులు

చదువుతోనే చిన్నారులకు బంగారు భవిష్యత్



అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు, బాలల సంరక్షణ కౌన్సిలర్ సురేష్

కేటీదొడ్డి: బాలల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలని బాలల సంరక్షణ కౌన్సిలర్ సురేష్ అన్నారు. సోమవారం మండలంలోని కొండాపురంలోని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని పత్తి చేనులో పని చేస్తున్న బాలలను గుర్తించారు. ఈ సందర్భంగా విద్యా ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకుంటేనే పిల్లలకు బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. బాలలు చదువుకోవడానికి ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు ప్రభుత్వం అనేక మౌలిక సదుపాయాలను కల్పిస్తోందని తెలిపారు. పొలంలో పని చేస్తున్న నలుగురు విద్యార్థులను గుర్తించి తిరిగి పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు, అవుట్ రీచ్ వర్కర్ ప్రకాష్, తల్లిదండ్రులు తదితరులు ఉన్నారు.

ఎంఈఓ పొలం బాట

విద్యార్థులు క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఎంఈఓ వెంకటేశ్వర్ రావు అన్నారు. సోమవారం మండలంలోని తూర్పుతండా, వాగుతండా, గువ్వలదిన్నె గ్రామాల్లోని పాఠశాలలను సందర్శించి బడికి రాని పిల్లల వివరాలు సేకరించారు. అనంతరం వారు పొలం పనులకు వెళ్లారని తెలిసి పొలాల వద్దకు వెళ్లి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పొలాల్లో పని చేస్తున్న విద్యార్థులను నందిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో సీఆర్పీ యుగేందర్, హెచ్‌ఎం జ్యోతి, గీతాంజలి, జయశ్రీ తదితరులు ఉన్నారు.



అమరవాయి పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

మల్దకల్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని వంట ఏజెన్సీ మహిళలకు ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్ సూచించారు. సోమవారం మండలంలోని అమరవాయి, బిజ్వారం, మేకలసోంపల్లి, ఉలిగేపల్లి గ్రామాల్లోని పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వడ్డించి వారి విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఆయన వెంట సీఆర్పీ వెంకటేష్, పద్మమ్మ, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల అవకతవకలపై ఫిర్యాదు

మల్దకల్: మండలంలోని నేతువానిపల్లిలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో చోటు చేసుకున్న అవకతవకలపై సోమవారం అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణకు గ్రామ యువకులు తిమ్మప్ప, సుధాకర్ ఫిర్యాదు చేశారు. గ్రామానికి 21 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా.. వాటిని కొందరు అనర్హులకు కేటాయించి డబ్బులు వసూలు చేశారని వారు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటున్న అనర్హులైన లబ్ధిదారుల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నట్లు వివరించారు. అక్రమాలకు పాల్పడని వారిపై చర్యలు తీసుకుని అర్హులకు న్యాయం చేయాలని వారు కోరారు.

కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి



అయిజ: సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని తపస్ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని ఉప్పల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలు, జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్న పాఠశాలల్లో తపస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆర్టీఈ యాక్ట్–2009 కు అనుగుణంగా ఏసీటీఈ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం 2010కి ముందు నియమితులైన ఉపాధ్యాయులను టెట్ అర్హత నుంచి మినహాయించారని, ఇందుకు భిన్నంగా ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తపస్ సభ్యులు భీమేశ్వర్‌రెడ్డి, నాగరాజు, మునివర్ధన్ రెడ్డి, జగన్, వెంకటేష్ పాల్గొన్నారు..

మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు ఘన నివాళి

గద్వాల టౌన్: మోక్షగుండం విశ్వేశ్వరయ్య ముందుచూపుతో ఆలోచించి నిర్మించిన ప్రాజెక్టులు నేడు దేశానికి వెన్నెముకగా నిలిచాయని జూరాల ప్రాజెక్టు డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజినీయర్ శ్రీనివాస్ చెప్పారు. సోమవారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని జిల్లా ఇంజినీర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక పీజేపీ క్యాంపులో ఉన్న విశ్వేశ్వరయ్య విగ్రహానికి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎస్‌ఈ శ్రీనివాస్, క్వాలిటీ కంట్రోల్ రిటైర్డు ఎస్‌ఈ శివప్రసాద్‌రెడ్డి, పీజేపీ డివిజన్–1 ఈఈ ఖాజా జునైద్‌అహ్మద్, పబ్లిక్ హెల్త్ ఈఈ విజయభాస్కర్‌రెడ్డి, మిషన్ భగీరథ ఈఈ శ్రీధర్‌రెడ్డి, విద్యుత్‌శాఖ ఈఈలు తిరుపతిరావు, నాగరాజు, ఆర్‌అండ్‌బీ డీఈ రాజశేఖర్, ఏఈఈ వెంకటరాజారెడ్డి, జయచంద్రారెడ్డి, గోపాల్ పలుశాఖలకు చెందిన ఏఈలు తదితరులు పాల్గొన్నారు.



జిల్లాకేంద్రంలో విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న డిప్యూటీ ఎస్‌ఈ, ఈఈలు

- గద్వాల పట్టణంలోని విశ్వేశ్వరయ్య హైస్కూల్ విద్యార్థులు జిల్లాకేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సాయిబాబా విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మహేశ్వర్‌రెడ్డి, జయప్రకాష్, విజయ్‌మోహన్, తారనాథ్, హెచ్‌ఎం కిషోర్ తదితరులు పాల్గొన్నారు.
- వడ్డేపల్లి మండలంలోని జూలెకల్‌లో విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కృష్ణారాజాసాగర్ పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలి

ధరూరు: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించడంతో పాటు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని ఎంఈఓ రవీంద్రబాబు, డీసీఈబీ సెక్రటరీ ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల పాఠశాలల నుంచి మొత్తం 600 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు నిర్వాహణ కమిటీ అధికారులు తెలిపారు. అండర్–14, అండర్–17 విభాగాల్లో బాల బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు.



విజేతలతో వ్యాయామ ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు


విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



ఉండవెల్లిలోని పాఠశాలను పరిశీలిస్తున్న డీఈఓ అబ్దుల్‌ఘనీ

ఉండవెల్లి: పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని డీఈఓ అబ్దుల్‌ఘని అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరిందని, మన ఊరు– మన బడి పథకంలో భాగంగా చేపట్టి, నిలిచిపోయిన పనులు, ఉపాధ్యాయుల రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం యూపీఎస్ ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించి, పాఠశాలలో కిచెన్ గార్డెన్లను ఏర్పాటు చేశారా లేదా అని అడగగా, వర్షం కారణంగా ఏర్పాటు చేయలేదని, కొన్ని చోట్ల పనులు పూర్తైనట్లు తెలిపారు. ఫేస్ రీడింగ్ యాప్‌ను అందరు వినియోగించుకోవాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, ప్రతి విద్యార్థుల నమోదును ఆన్‌లైన్‌లో నమోదు చేయ్యించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు నిర్మించే మూత్రశాలను కొందరు వ్యక్తులు రాజకీయం చేస్తు నిలిపివేస్తున్నారని ఆదర్శ సంఘం సభ్యులు, కాంట్రాక్టర్ వెంకటేష్‌గౌడ్ డీఈఓకు వివరించగా.. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పనులు ప్రారంభించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం హేమలత, ఇన్‌చార్జి ఎంఈఓ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాత జీఓ ప్రకారమే వంతెన నిర్మించాలి



ధరూరు: బంగారం లాంటి తమ భూములు, ఇళ్లు, సర్వస్వాన్ని కోల్పోయిన తమ గ్రామాలను కాదని ఇతర ప్రాంతాల్లో వంతెనలు నిర్మించడం తగదని, హైలెవెల్ వంతెనను పాత జీఓ ప్రకారమే నిర్మించాలని రేవులపల్లి గ్రామస్తులు ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు కుడి కాల్వ వద్ద డ్యాంపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు, గద్వాలకు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కొత్తపల్లి వద్ద వంతెనను నిర్మిస్తామని చెప్పడం భావ్యం కాదన్నారు. దాదాపు గంట పాటు ప్లకార్డులను ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు.

రూ.20వేల విరాళం

మల్దకల్: మండలంలోని బిజ్వారంలో నూతనంగా నిర్మించనున్న చర్చి ఫంక్షన్ హాల్‌కు బీఆర్‌ఎస్ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి బాసు హన్మంతునాయుడు రూ.20 వేల విరాళం అందజేశారు.

పరిసరాలను పచ్చదనంతో నింపాలి

ధరూరు: స్వచ్ఛ ఎవమ్‌పై ప్రతి ఒక్క విద్యార్థికి అవగాహన కల్పించాలని డీసీఈబీ సెక్రటరీ ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయా గ్రామాల పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. విద్యార్థుల్లో శుభ్రత అలవాటును పెంపొందించడం, పాఠశాల పరిసరాలను పచ్చదనంతో నింపడం, విద్యాలయ ప్రాంగణంలో మలినాలు తొలగించడం, నీటి వనరుల సంరక్షణ, వర్షపు నీటి సంగ్రహణ, సోలార్ ఎనర్జీ, పునరుత్పాదక శక్తుల వినియోగం పెంపొందించడం తదితర అంశాల గురించి వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ రవీంద్రబాబు, ఉపాధ్యాయులు, సీఆర్పీ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీఈబీ సెక్రటరీ ప్రతాప్‌రెడ్డి

దివ్యాంగులకు పింఛన్‌ను పెంచాలి

సాక్షి, నెట్‌వర్క్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగుల పింఛన్‌ను వెంటనే రూ.6 వేలకు పెంచాలని దివ్యాంగులు సోమవారం జిల్లావ్యాప్తంగా తహసీల్దార్లకు వినతిపత్రాలు అందించారు

- ధరూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద దివ్యాంగులు ఆందోళన చేపట్టి, తహసీల్దార్ నరేందర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆంజనేయులు, తిమ్మారెడ్డి, భీమన్న, పద్మారెడ్డి, నాగరాజు, మల్లేష్, తిమ్మన్న తదితరులు పాల్గొన్నారు.
- ఉండవెల్లి తహసీల్దార్ కార్యాలయంలో దివ్యాంగులు తహసీల్దార్ ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఎలీషా, రాజు, జయన్న, దివ్యాంగుల జిల్లా అధ్యక్షుడు సుబాన్ బాషా, హనీఫ్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉండవెల్లిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు

- శాంతినగర్ తహసీల్దార్ కార్యాలయాన్ని దివ్యాంగులు ముట్టడించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు కొంకల భీమన్న, కాశపోగు రాజశేఖర్, వడ్డేపల్లి మండల అధ్యక్షుడు గ్యాంగ్ రవి, శేఖర్, వీహెచ్‌పీఎస్ నాయకులు కృష్ణ, కృష్ణారావు, దేవన్న, ఎంఎస్‌ఎఫ్ వడ్డేపల్లి మండల అధ్యక్షుడు పైపాడు ఏసేపు మాదిగలు పాల్గొన్నారు.